క్లుప్తంగా

ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా బ్రహ్మాజీ మాస్టర్

కర్నూలు(హాస్పిటల్): ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం కర్నూలు మెడికల్ కాలేజీ అధ్యక్షుడిగా డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ (ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్) ఎన్నికయ్యారు. సంఘం నాయకులు బుధవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని ఓల్డ్ క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో సమావేశమయ్యారు. ఇప్పటి వరకు అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ శ్రీరాములు ఆదోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లడంతో అధ్యక్ష స్థానానికి ఎన్నిక జరిపారు. బుధవారం జరిపిన ఎన్నికల్లో డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం మెడికల్ కాలేజీలోని క్యాంటీన్‌ను తెరిచేందుకు కళాశాల ప్రిన్సిపాల్‌ను కలవాలని సంఘం నాయకులు తీర్మానించారు. సమావేశంలో డాక్టర్ విజయమోహన్‌రెడ్డి, డాక్టర్ దమాం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరికరాల కొనుగోలుకు చర్యలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పలు వైద్యపరికరాల కొనుగోలు కోసం అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో కర్నూలులోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో మాత్రమే ఉండే డెక్సా స్కాన్ కూడా ఉంది. దీని ద్వారా ఎముకలు, కండరాల సాంద్రత గురించి తెలుసుకుని అవసరమైన చికిత్స అందిస్తారు. దీంతో పాటు ఎక్స్‌రేల కోసం క్యాసెట్ రీడర్ ఒకటి, 25 ఏసీలు, రెండు అల్ట్రాసౌండ్ మిషన్లు ఉన్నాయి. ఇవన్నీ ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ నిధులతో కొనుగోలు చేయనున్నారు. వీటితో పాటు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ వారు విరాళమిస్తున్న మూడు అనెస్తీషియా వర్క్‌స్టేషన్స్ కూడా ఉన్నాయి. గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా డిస్ట్రిక్ట్ పర్చేజ్ కమిటీ ఆధ్వర్యంలో టెండర్ బాక్స్ తీయనున్నారు. ఒక్కో వైద్యపరికరం కేటగిరీకి నలుగురు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

సత్వర న్యాయానికి శాశ్వత లోక్ అదాలత్

కర్నూలు (లీగల్) : సత్వరం న్యాయం కోసం శాశ్వత లోక్ అదాలత్ ఏర్పాటు అయినట్లు ఆ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్ పేర్కొన్నారు. బుధవారం న్యాయ సేవా సదన్‌లో అన్ని శాఖల అధికారులకు చట్టపర అంశాలపై అవగాహన శిబిరం నిర్వహించారు. న్యాయ సేవలకు కర్నూలులోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న శాశ్వత లోక్ అదాలత్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్) : ఈనెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు బిహార్ పట్టణంలో జరిగే జాతీయ స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి సురేష్, వెంకటేష్, భాస్కర్, అక్షయ్య అనే నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి సువర్ణ వెల్లడించారు. ఈనెల 8, 10 తేదీల్లో కర్నూలు పట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర జట్టుకు ఎంపికయినట్లు తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలుపై ప్రత్యేక దృష్టి

కర్నూలు (సిటీ) : ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులకు ఆదేశించారు. బుధవారం ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రిటర్నింగ్ అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ సృజన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎం గోడౌన్లను పరిశీలించారు.

ప్రజలకు భరోసా కల్పించేందుకే పోలీసు కవాతు

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే స్థానిక పోలీసులతో కలసి కేంద్ర సాయుధ బలగాలు సమస్యాత్మక, సున్నిత ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నాయని ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం కర్నూలు ఒకటో పట్టణ సీఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని జొహరాపురం, ఇందిరమ్మ గృహాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కర్నూలు (టౌన్) : క్రీడాకారులు అందివచ్చిన అవకాశాలను వినియోగించుకొని క్రీడల్లో రాణించాలని సెట్కూరు సీఈఓ రమణ అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-17 విభాగంలో బాల బాలికల మాడ్రన్ పెంటాథ్లాన్ ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావుతో కలిసి సీఈఓ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల గోవాలో జరిగిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారుడు వెంకటేష్ మోడ్రన్ పెంటాథ్లాన్‌లో పతకం సాధించాడని గుర్తు చేశారు. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య మాట్లాడుతూ ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు ఈనెల 30 నుంచి 31 వరకు తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా మోడ్రన్ పెంటాథ్లాన్ కార్యదర్శి అవినాష్ పాల్గొన్నారు.

సంక్షేమానికి ఓటేయండి

- 16వ వార్డులో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం
- ఇంతియాజ్‌ను కాలనీ వాసులకు పరిచయం చేసిన ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ



స్వామిరెడ్డి నగర్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కరపత్రం అందజేస్తున్న కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, చిత్రంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ఆ పార్టీ కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఓటర్లను విజ్ఞప్తి చేశారు. నగరంలోని స్థానిక 16 వ వార్డు స్వామిరెడ్డి నగర్‌లో బుధవారం సాయంత్రం ఆ పార్టీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్‌తో కలిసి వారు ప్రచారం నిర్వ హించారు. ముందుగా వారు ఇంతియాజ్‌ను కాలనీ ప్రజలకు పరిచయం చేసి అండగా నిలబడాలని కోరారు. ఇంటింటికెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలకు చేకూరిన లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు న్యాయం జరిగిందంటే అప్పట్లో దివంగత రాజశేఖర్‌రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే అని అన్నారు. ఐదేళ్ల పాటు జనరంజక పాలన అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. పేదలను పట్టించుకోని టీడీపీ నాయకులు ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడటంతో మాయమాటలు చెబుతారని, వారిని నమ్మొద్దన్నారు. జగనన్న ప్రభుత్వంలోనే ప్రతి కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు. రానున్న కాలంలో మరింత మేలు చేకూరాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఇఫ్తారు విందులో ఇంతియాజ్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ, పార్టీ నాయకుడు అహ్మద్ అలీఖాన్

నగరాభివృద్ధికి కృషి చేస్తా

తనకు అవకాశం ఇస్తే కర్నూలు నగర అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. బుధవారం నగరంలోని స్థానిక రామలింగేశ్వర్‌నగర్ పార్కులో ఆయన మార్నింగ్ వాక్ నిర్వహించారు. అక్కడికి వచ్చిన మహిళలు, వృద్ధులు, రిటైర్డు ఉద్యోగులు, యువకులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే జగన్ ప్రభుత్వం ఐదేళ్ల పాలన గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు.

ఇఫ్తారు విందులో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్

నగరపాలక సంస్థ పరిధిలోని 11 వ వార్డు కార్పొరేటర్ ఫరాజ్‌ఖాన్ ఆహ్వానం మేరకు బుధవారం ఖడక్‌పురాలోని అమన్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఇఫ్తారు విందులో ఇంతియాజ్ పాల్గొన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, నాయకులు అహ్మద్ అలీఖాన్, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.

బాబు కూటమికి ఓటమి తప్పదు

- అన్నివర్గాల నిరుపేదలు జగనన్న వెంటే
- మేమంతా సిద్ధం పోస్టర్ల ఆవిష్కరణలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



మేమంతా సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్) : వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని బీజేపీ, జనసేనతో కలిసి వస్తున్న చంద్రబాబుకు మళ్లీ ఓటమి తప్పదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక సి. క్యాంపులోని తన కార్యాలయంలో మేమంతా సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు. నేడు,రేపు నంద్యాల, కర్నూలు జిల్లాల్లో జరిగే జగనన్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర తరువాత వైఎస్సార్‌సీపీకి రాష్ట్రంలో వార్ వన్‌సైడ్ అవుతుందన్నారు. జగనన్న పాదయాత్రలు చేసినా, బస్సుయాత్రలు చేసినా ప్రజలు స్వచ్ఛందంగా సునామీలా తరలి వస్తారన్నారు. వెన్నుపోట్లకు, కుట్రలకు, కుతంత్రాలకు కేరాఫ్ అయిన చంద్రబాబును ప్రజలు ఆదరించరన్నారు. జనసేన నేత పవన్ కల్యాణ్ ఊగిపోవడం, అరవడం తప్పా ప్రజల పక్షాన నిలిచిన వ్యక్తి కాదన్నారు.

దమ్మున్న నాయకుడు జగనన్న

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమం, మేలు జరిగి ఉంటే తనకు ఓటు వేయాలని చెప్పిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దమ్మున్న నాయకుడని సుభాష్ పేర్కొన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇంత ధైర్యంతో ఎన్నికలకు వెళ్ల లేదన్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడం వల్లే ప్రజలంతా జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలతో పాటు అగ్ర వర్గాల్లోని నిరుపేదలందరూ జగనన్న వెంటే ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లేష్, గాలన్న, శేఖర్, పవన్, మధు పాల్గొన్నారు

40వ వార్డులో ఇంటింటి ప్రచారం



ఎన్నికల ప్రచారంలో కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్ సతీమణి డాక్టర్ స్టెల్లా సతీష్

కర్నూలు (సిటీ): కోడుమూరు నియోజకవర్గానికి చెందిన కర్నూలు అర్బన్ ప్రాంతంలోని 40వ వార్డులో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ సతీమణి డాక్టర్ స్టెల్లా సతీష్ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం పరితపించే ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో మీ ఇంట్లో జరిగిన మేలును గుర్తు చేసుకుని ఎమ్మెల్యేగా సతీష్‌కు, ఎంపీగా బీవై రామయ్యకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో 40వ వార్డు కార్పొరేటర్ విక్రమ సింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జనరల్ సెక్రటరీ గిరిప్రసాద్ రామ్, పార్టీ కార్యకర్తలు మహేష్, శేఖర్, రవి,వెంకటేష్,అపోలో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



మాట్లాడుతున్న వీసీ సుధీర్ ప్రేమ్ కుమార్

కర్నూలు కల్చరల్: విద్యార్థులు చదువుకునే సమయంలోనే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవా లని ఆర్‌యూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం వర్సిటీలో 'ఇంజినీరింగ్ విద్య, ఉపాధి అవకాశాలు, రహదారి సాంకేతికత' అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వర్సిటీలో వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విషయ పరిజ్ఞానం పెంచుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. రహదారులు భవనాల శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ కె.నయీముల్లా మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ నాగుల అంకన్న, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ సి.వి.కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. హరి ప్రసాద్‌రెడ్డి మాట్లాడారు.

తాగునీటిని పొదుపుగా వినియోగించుకోండి

కర్నూలు (టౌన్) : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరప్రజలు తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఏడాది అతి తక్కువ వర్షాపాతం నమోదు కావడంతో సుంకేసుల రిజర్వాయర్‌లో నీటి నిల్వలు అడుగంటి పోయాయని తెలిపారు. నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం 70 కిలో మీటర్ల దూరంలోని గాజులదిన్నె ప్రాజక్టు నుంచి నీటిని తీసుకొస్తున్నామన్నారు. అయితే, అక్కడి నుంచి వస్తున్న నీరు ఇదివరకులాగా ప్రతి రోజు నీటి సరఫరా చేసేందుకు సరిపోవన్నారు. ఈనేపథ్యంలో రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తామని, ఇందుకు నగర ప్రజలు సహకరించాలని కోరారు.

మళ్లీ జగనన్నే సీఎం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



32వ వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ని పార్టీలు జత కట్టి వచ్చినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 32వ వార్డులోని ముజఫర్‌నగర్, సుందరయ్యనగర్‌లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు కూటమి కట్టారన్నారు. అలాంటి నాయకుడికి, పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. తాము 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశామన్నారు. నవరత్నాల పథకాలతో పేదల జీవితాలు బాగుపడ్డాయన్నారు. కులమతాలు, రాజకీయాలు, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత టీడీపీ పాలనలో పేద ప్రజలు ప్రభుత్వ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీ సిఫార్సులతో పాటు నాయకుల అండదండలు ఉండాలన్నారు. ఇప్పుడు ఎక్కడా ఆ పరిస్థితి లేదని సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయన్నారు. మరింత మంచి చేసేందుకు వచ్చే ఎన్నికల్లో పాణ్యం ఎమ్మెల్యేగా మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సాన శ్రీనివాసులు, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వార్డులోని స్థానిక నాయకులు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వచ్చే నెల నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ ఫైబర్ సేవలు



మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ జీఎం రమేష్

కర్నూలు (న్యూటౌన్): బీఎస్ఎన్ఎల్ కాపర్ ద్వారా అందిస్తున్న ల్యాండ్‌లైన్ వాయిస్, ఇంటర్నెట్ సేవలను పూర్తిగా ఫైబర్‌లోకి మార్చి ఏప్రిల్ నెల నుంచి అందుబాటులోకి తీసుకువస్తున్నామని ఆసంస్థ కర్నూలు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి రమేష్ తెలిపారు. కర్నూలులోని బీఎస్ఎన్ఎల్ భవన్‌లోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి చార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్ లేకుండా టెలికాం ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్ ద్వారా గృహాలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ కాపర్ నుంచి ఎఫ్‌టీటీహెచ్‌లోకి మారుస్తామన్నారు. ఏప్రిల్ 1 నుంచి బీఎస్ఎన్ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియాలో దశలవారీగా 4జీ సేవలను అందిస్తామన్నారు. మొదటి విడతలో కర్నూలు నగరంలో 30, నంద్యాల పట్టణంలో 13 టవర్లను 4జీలోకి మారుస్తామన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 376 టవర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వినియోగదరులందరూ 4జీ సిమ్‌లోకి అప్‌గ్రేడ్ చేసుకుని ఈకేవైసీ చేసుకోవాలని ఆయన కోరారు. ఫైబర్‌నెట్ యూజర్ల కోసం 18004444 వాట్సాప్‌చాట్‌బాట్ సేవలు ప్రారంభమయ్యాయని, ఈ నంబర్‌లో హాయ్ అని పంపించి ఫైబర్ సేవలను పొందవచ్చన్నారు. బీఎస్ఎన్ఎల్ సరికొత్త ప్లాన్ 'ఫైబర్ బేసిక్ ఓటీటీ' ప్రవేశపెట్టామని, కేవలం రూ.599కే 70ఎంబీపీఎస్ స్పీడ్‌తో 4000జీబీ వరకు ఉచితంగా డిస్నీప్లస్ హాట్‌స్టార్ సూపర్ ప్లాన్ ఓటీటీ సర్వీస్‌లను పొందవచ్చని పేర్కొన్నారు.

జాతీయ షూటింగ్ బాల్ పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): ఈనెల 29 నుంచి 31 వరకు ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ పట్టణంలో జరిగే 42వ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ఏపీ జట్టు ప్రతిభ చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక బి. క్యాంపు క్రీడా మైదానంలో ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ జట్టును అభినందించారు. అనంతరం జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాల బాలికల జట్టును ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరశురాముడు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య, న్యాయవాది శ్రీధర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పరమేశ్వర రెడ్డి, అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారుడు దేవేంద్ర పాల్గొన్నారు .

సంగీత గురువులకు సన్మానం

కర్నూలు కల్చరల్: స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ప్రపంచ రంగస్థల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నగరంలోని సంగీత గురువులు బండారు బలరాముడు, ఇ.పాండురంగయ్య, జి.వెంకటేశ్వర్లు, జేఎంజే రాజు, ధనుంజయ, శ్రీనివాసులు, కేశవులు తదితరులను సత్కరించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో విశ్రాంత జిల్లా కలెక్టర్ జి.బలరామయ్య తెలుగు పద్య నాటకం వైభవంపై ఉపన్యాసించారు. కార్యక్రమంలో జిల్లా రంగస్థల కళాకారులు అంకయ్య, వీవీ రమణారెడ్డి, బీసన్న, కళాక్షేత్రం కళాకారులు మహమ్మద్ మియా, ఇనాయతుల్లా, సంగా అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అనుమతులు తప్పనిసరి

కర్నూలు (సిటీ) : రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి అని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. బుధవారం వివిధ జిల్లాల ఎన్నికల అధికారులతో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తీరుపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు 48 గంటలు ముందుగానే సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.